సీపీఎం విరాళాల సేకరణ



ఘట్‌కేసర్‌లో నిధులు సేకరిస్తున్న సీపీఎం నేతలు

ఘట్‌కేసర్: క్యూబాపై అమెరికా ఆంక్షలు తిప్పి కొట్టి అండగా నిలవాలని సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు మండలశాఖ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ గురువారం సంఘీభావ నిధి సేకరించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు యాదయ్య, మండల కార్యదర్శి సబిత మాట్లాడుతూ.. మానవాళి సంక్షేమం కోరుతున్న క్యూబాపై అమెరికా చేస్తున్న దౌర్జన్యాలను ప్రతిఘటించాలని కోరారు. సీపీఎం నాయకులు యాదగిరి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ఎవరెస్ట్‌ను అధిరోహించిన విద్యార్థిని



శరణ్య

కీసర: భోగారం మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థిని అర్ల శరణ్య గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు శరణ్యకు అభినందనలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో ఎన్నో విజయాలను సాధించాలని ప్రిన్సిపాల్ సంతోష ఆకాంక్షించారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఆర్టీఐ ప్రతినిధులు



మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌ను జిల్లా గుడ్ గవర్నెన్స్ సొసైటీ సభ్యులు కలిశారు. గురువారం ఎల్లంపేట్‌లోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి సన్మానించారు. ఆర్టీఐ చట్టం గురించి కమిషనర్‌తో మాట్లాడారు. సొసైటీ సభ్యులు చందర్, రమేష్‌గుప్తా, వంశీకృష్ణ తదితరులున్నారు.

భార్యపై హత్యాయత్నం కేసులో..

నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష



జైపాల్‌గౌడ్

ఘట్‌కేసర్: భార్యపై హత్యాయత్నం చేసిన నిందితుడికి కోర్టు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన సార జైపాల్‌గౌడ్, జ్యోతితో 22 ఏళ్ల క్రితం వివాహమైంది. కాగా భర్త మద్యానికి బానిసై నిత్యం భార్యను మానసికంగా, శారీరకంగా వేధిస్తూ.. దాడి చేసేవాడు. దీంతో విసిగిపోయిన ఆమె 2024 పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు. ఇరువురి వాదనలు విన్న కోర్టు నిందితుడికి గురువారం మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1500 జరిమానా విధించింది.

రసాయన ఎరువులతో పర్యావరణానికి హాని

ప్రొ. జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ ప్రొఫెసర్ నరేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఇష్టానుసారంగా రసాయన ఎరువులు వాడటంతో పర్యావరణం దెబ్బతింటోందని, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ నరేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి లావణ్య అన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం గురువారం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యూరియా వాడకం, సాగు ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. డాక్టర్ సురేష్ మాట్లాడుతూ.. అధిక దిగుబడుల కోసం నాణ్యమైన విత్తనాలు వినియోగించాలని, ప్రతి కొనుగోలుకు తప్పకుండా రశీదు తీసుకోవాలని సూచించారు. ఏఈఓ జగదీశ్వర్, రైతులు సాయిలు, ఎల్లయ్య, రవి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మూల కృష్ణ (31) మేడ్చల్ పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటల తర్వాత విధులు ముగించుకుని, తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో అత్వెల్లి మజీద్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో కృష్ణ తలకు తీవ్ర గాయాలు కాగా.. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పని నిరీక్షణ !

రేషన్ కోసం క్యూలైన్‌లో ఎదురుచూస్తున్న లబ్ధిదారులు



గుండ్లపోచంపల్లిలో రేషన్‌షాపు వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

మేడ్చల్: మూడు నెలల స్టాక్ ఒకేసారి ఇస్తుండటంతో రేషన్‌షాపుల వద్ద సరుకులు తీసుకునేందుకు లబ్ధిదారులకు నిరీక్షణ తప్పడం లేదు. ఆదివారం నుంచి 3 నెలల బియ్యం పంపిణీ చేస్తున్నా.. రేషన్ షాపుల వద్ద ఏ మాత్రం తగ్గడం లేదు. పంపిణీ ఆలస్యమవుతుండటంతో బియ్యం తీసుకోవడానికి షాపుల వద్ద గంటల తరబడి లబ్ధిదారులు వేచి ఉండాల్సి వస్తుంది.

3 సార్లు బయోమెట్రిక్‌తో ఇబ్బంది..

3 నెలల బియ్యం తీసుకోవడానికి లబ్ధిదారులు బయోమెట్రిక్ ఇవ్వడం కోసం 3 సార్లు వేలిముద్ర ఇవ్వండం, అది త్వరగా స్కాన్ కాకపోవడంతో పంపిణీ వ్యవస్థ డీలా పడింది. ఒక్కో లబ్ధిదారుడికి మూడు నెలల బియ్యం ఇవ్వడానికి అరగంట సమయం పడుతుండటంతో లబ్ధిదారులు గంటల తరబడి రేషన్ దుకాణం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

ఎటు చూసినా క్యూలైన్లే..

ఏ రేషన్‌షాపు వద్ద చూసినా క్యూలైన్లే దర్శనమిస్తున్నాయి. గత 4 రోజుల నుంచి రేషన్ షాపుల వద్ద క్యూలైన్లు నిత్యకృత్యంగా కనిపిస్తున్నాయి. మేడ్చల్ నియోజకవర్గంలోని మేడిపల్లిలో బియ్యం కోసం వచ్చిన వృద్ధురాలు ఏకంగా లైన్‌లో నిలబడటం వల్ల ఆలస్యమవుతుందని వెంట సద్ది మూట తెచ్చుకుని అక్కడే భోజనం చేసింది. క్యూలైన్‌లో భోజనం చేసే దాకా పరిస్థితి వచ్చిందంటే రేషన్ షాపుల వద్ద గత 4 రోజులుగా పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది.

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

శామీర్‌పేట్: భూ సమస్యల సమస్యల పరిష్కారానికి ప్రభుత్రం కృషి చేస్తుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. రెవెన్యూ సదస్సులో భాగంగా గురువారం శామీర్‌పేట మండలంలోని పొన్నాల్ గ్రామంలో నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సును కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం చేయకుండా వెంటనే పరిష్కరించి, రైతులకు ప్రభుత్వంపై భరోసా కల్పించాలన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణ ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించాలని పేర్కొన్నారు. శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో రెవెన్యూ సమస్యల పరిష్కారం..

ఘట్‌కేసర్: భూభారతి కొత్తచట్టం ద్వారా రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నాయబ్ తహసీల్దార్ రాజేందర్ అన్నారు. గురువారం పడమటి సాయిగూడలో నిర్వహించిన రైతుసదస్సులో మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్యతో కలిసి రైతుల నుంచి 10 దరఖాస్తులు స్వీకరించారు. వారు మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల్లో తప్పులు దొర్లితే సరిచేసుకోవాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్ఐ సాయిరాం, జంగయ్యయాదవ్, మల్లేష్, నాగరాజు ముదిరాజ్, ఖయూమ్, అభిలాష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో డిప్యూటీ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తదితరులు



దరఖాస్తులను పరిశీలిస్తున్న నాయబ్ తహసీల్దార్, మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య

వికసిత్ భారత్‌లో యువతది కీలకపాత్ర

తెలంగాణ ఉన్నత విద్యామండలి గౌరవ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి



విద్యార్థులతో అతిథులు బాలకృష్ణారెడ్డి, బాలప్రసాద్

ఘట్‌కేసర్: వికసిత్ భారత్‌లో యువత కీలకపాత్ర పోషించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన స్నాతకోత్సవానికి టీసీఎస్ గౌరవ అతిథి ప్రిన్సిపాల్ కన్సల్టెంట్, చీఫ్ ఇన్నొవేషన్ ఆఫీసర్ బాలప్రసాద్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆకాశం వరకు ఉన్న అవకాశాలు పొందాలంటే శిక్షణ, సరికొత్త ఆలోచనలు అవసరమని తెలిపారు. భారతదేశం ప్రపంచానికి అవసరమైన మానవ వనరులు అందిస్తోందన్నారు. ఇన్నోవేషన్, మల్టీ-డిసిప్లినరీ ఆలోచనల అవసరానికి ఏ-జెడ్ వరకు టెక్నాలజీలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఓ విద్యార్థి లెర్నర్‌గా ప్రవేశించి ఎర్నర్‌గా మారతాడన్నారు. ప్రపంచాన్ని టెక్నాలజీ మారుస్తుందని, కృత్రిమ మేధస్సులో ముందుకు సాగుతుందన్నారు. నేటి యువత అప్‌డేట్ కావాలని లేని పక్షంలో అవుట్‌డేట్ అవుతారన్నారు. సంస్కృతి విద్యాసంస్థల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, డైరెక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి, జానకీరాములు, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి బడిబాట

కీసర: కీసర మండల పరిధిలోని అన్ని పాఠశాలలో నేటి నుంచి 19వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ 'బడిబాట' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కీసర ఎంఈఓ ఎం.జమదగ్ని తెలిపారు. 6 నుంచి 19 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బడిబాట ముగింపు రోజున విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

విద్యార్థిని అదృశ్యం



సింధు (ఫైల్)

జవహర్‌నగర్: మానసిక స్థితి సరిగ్గాలేని ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ బీజేఆర్‌నగర్‌లో నివసించే మస్కూరి పల్లవి, కుమార్తె సింధు (19) బాలాజీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుకుని, మానసికస్థితి బాగాలేకపోవడంతో చదువు ఆపేసింది. ఈనెల 2న ఇంటి పక్కన ఉండే బాత్‌రూమ్‌కు వెళ్తున్నానని చెప్పి, తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెళ్లి పరిశీలించగా కనిపించలేదు. దీంతో వారు ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



రష్మిత (ఫైల్)

పోచారం: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని ఎల్‌బీజీ కాలనీలో ఏ6 బ్లాక్, 208 ఫ్లాట్‌లో రష్మిక (40), భర్త ప్రశాంత్‌కుమార్ జేన, ముగ్గురు పిల్లలతో ఉంటున్నారు. ప్రశాంత్ 15 రోజుల క్రితం పనిపై బెంగుళూరుకు వెళ్లాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో వాటర్‌లో హీటర్ ఉంచారు. అనుకోకుండా వాటర్ హీటర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. ఇంట్లో ఉన్న పిల్లలు కేకలు వేయడంతో గమనించిన స్థానికులు ఆమెను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్ నాగిరెడ్డితో సమావేశమైన బీజేపీ నేతలు

మేడ్చల్: పట్టణంలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని పట్టణ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో బీజేపీ నేతలు కమిషనర్ నాగిరెడ్డితో సమావేశమై సమస్యలను విన్నవించారు. గోదావరి నీటిసరఫరా సరిగ్గా కావడంలేదని, 3 రోజులకోసారి నీరు నల్లాల ద్వారా వస్తున్నాయన్నారు. పట్టణమంతా బస్తీల్లో తీవ్ర నీటి సమస్య నెలకొందని వివరించారు. బీజేపీ నేతలు శైలజ, మురళీధర్‌గుప్తా, సుధాకర్‌రెడ్డి, వంశీవిజయ్, అర్జున్, ప్రేమ్‌దాస్, శ్రీనివాస్‌గౌడ్, రాఘవరెడ్డి, ఈశ్వర్, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు



డబీల్‌పూర్‌లో లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న దృశ్యం

కీసర: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నాగారం మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుడు ఏలూరు మల్లేష్ ఇంటి వద్ద నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు అధికారుల సూచనల మేరకు ఇంటి నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం సొంతిల్లు లేని పేదలకు తమ సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు పంగ ముత్యాలు, అన్నం రాజు సుమిత్ర సురేష్, బాల్‌నర్సింహ్మా, సోమయ్య, మల్లేష్, ఫణీంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

డబీల్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని డబీల్‌పూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను కాంగ్రెస్ నేతలు అధికారులతో కలిసి గురువారం పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లను 40 రోజుల్లోగా ప్రారంభించాలని సూచించారు. అర్హత ఉండి ఇళ్లు మంజూరు కాని వారు ఉంటే ఇందిరమ్మ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు. మాజీ సర్పంచ్ సంజీవరావు, రమణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, సాలాం, సాయిబాబా, శ్రీనివాస్, ముత్యాలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మేడ్చల్ : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్ బస్తీ దవాఖానాలో సనాతన ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో మాజీ కౌన్సిలర్ లావణ్య హన్మంత్‌రెడ్డి, సమితి సభ్యుడు రాజేష్‌నేతి, వైద్యులు ఉషారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్‌ను మేడ్చల్ డీసీపీ కొటిరెడ్డి గురువారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తుర్కపల్లిలో నిర్మిస్తున్న జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ నిర్మాణ పనులను పరిశీలించారు. కరీంనగర్ - హైదరాబాద్ రాజీవ్‌రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను పరిశీలించారు. బక్రీద్ సందర్భంగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డీసీపీ వివరించారు.

అవార్డు ప్రదానం

పోచారం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 2025వ సంవత్సరానికి ఎక్సలెన్స్ అవార్డును రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ చైర్మన్ రామానాయుడుకు ఈసీజీ ఫౌండేషన్ గురువారం అందజేసింది. ఇండో, యూకే గ్రీన్‌డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా అవార్డు ప్రదానం చేశారు. ప్రకృతిమాతకు చేసిన సేవలు, పర్యావరణ పరిరక్షణ, విద్య-ఆరోగ్య రంగాల్లో నూతన ఆవిష్కరణల విషయంలో రామానాయుడు చేసిన అసాధారణ కృషికి అవార్డు లభించింది.



అవార్డును అందుకుంటున్న రామానాయుడు

సెల్‌ఫోన్ రిపేర్‌కు వెళ్లి..

యువకుడి అదృశ్యం

మేడిపల్లి: సెల్‌ఫోన్ రిపేర్ చేయించుకుని వస్తానని ఇంటినుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిన వివరాల ప్రకారం.. మేడిపల్లి అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న దొంతి వెంకటేష్ కుమారుడు వెంకటరమణ (19) గతనెల 24న తన సెల్‌ఫోన్ రిపేర్ చేయించుకుని వస్తానని బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం తెలిసిన వారివద్ద, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం కుటుంబసభ్యులు మేడిపల్లి పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురాతన బావిని పట్టించుకోరూ !

వ్యర్థాలతో నిండిపోతున్న మెట్ల బావి



మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వ్యర్థాలతో ఇలా..

మేడ్చల్: ఎంతో మందికి దాహార్తిని తీర్చి, ఎంతోమంది అధికారులు, ప్రజాప్రతినిధులు, సమీప కాలనీలకు భూగర్భ జలాలు అందించిన పురాతన బావి అందమైన కట్టడంతో చరిత్రకు వారసత్వంగా కనిపించేది. ప్రస్తుతం ఆ బావిని పట్టించుకునేవారు లేకపోవడంతో చెత్తమయంగా మరింది.

- మేడ్చల్ తాలుకా ఉన్న సమయం నుంచి నాటి పాలకులు లోతుగా బావిని తవ్వి లోపలి భాగంలో రాళ్లతో అందంగా గోడలు నిర్మించి అందులోకి దిగేందుకు మెట్లను ఏర్పాటు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు అందులోనే అధికారులు నివాస గృహాలు ఉండేవి. అందరి తాగునీటి సమస్యను తీర్చి అందరికీ ఉపయోగపడిన బావి నేడు నిరుపయోగంగా మారింది. బావిలో నీరు పూర్తిగా ఇంకిపోవడంతో సమీప కాలనీల ప్రజలు, ఆవరణలో ఉన్న కార్యాలయాల నుంచి వచ్చే చెత్తను అందులోవేసి నింపుతున్నారు. క్రమంగా బావి చెత్తతో నిండిపోతోంది. పురాతన బావి వైపు రాకుండా బావి పైకప్పులో ఇనుప జాలీలు ఏర్పాటు చేసి, చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకుని చరిత్ర గల బావిని కాపాడాల్సిన భాద్యత అధికారులు, ప్రజలపై కూడా ఉందని పలువురు భావిస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా..

తప్పిన ప్రమాదం



కేఎల్‌ఆర్‌లో బోల్తాపడిన వాటర్ ట్యాంకర్

మేడ్చల్: పట్టణంలోని కేఎల్‌ఆర్‌లో వాటర్ ట్యాంకర్ అతివేగంతో వెళ్తూ.. అదుపు తప్పి బోల్తా పడింది. గురువారం ఉదయం వాటర్ ట్యాంకర్ నీటిని తీసుకుని వెళ్తుండగా.. అదుపు తప్పడంతో రోడ్డు పైనే బోల్తా కొట్టింది. ఉదయం కావడంతో వాకర్స్ సమీపంలోకి వెళ్లగా.. వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ట్యాంకర్ల డ్రైవర్లు మితిమీరిన వేగంతో వెళ్లడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి

● ఘనంగా పర్యావరణ దినోత్సవం ● 'ఒక మార్పు – అభివృద్ధికి మలుపు' పేరుతో అవగాహన ర్యాలీ

ఘట్‌కేసర్: 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం, వనమహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గురుకుల్ క్రీడా మైదానంలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ×ఒక మార్పు–అభివృద్ధికి మలుపు¥ అనే నినాదంతో గురుకుల్ కళాశాల నుంచి ఈడబ్ల్యూఎస్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, రెవెన్యూ అధికారి కవిత, స్వయం సహాయక సంఘాల సభ్యులు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: పర్యావరణ దినోత్సవం సందర్భంగా మేడ్చల్ మున్సిపాలిటీ పూడూరు గ్రామంలోని శివాలయంలో పైపులైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ఏరియా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఇన్‌చార్జ్, సీనియర్ జనరల్ మేనేజర్ రామ్‌నర్సింహ, మున్సిపల్ సిబ్బంది మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, కంపెనీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో..

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని నినాదాలు చేశారు. కళాశాల డైరెక్టర్ డా.సీ.వీ.కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సతీష్‌కుమార్, కో- ఆర్డినేటర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో..

కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ హాజరై ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. హెచ్‌ఎం. సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ వనమహోత్సవం ర్యాలీలో ఇన్‌చార్జ్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి



అవగాహన ర్యాలీలో విద్యార్థులు



రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో..

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387